
సాక్షి ఒడిశా

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 8.59.225

బంగారం : 350 మిల్లీ గ్రాములు

వెండి : 14 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



విలయానికి నలుగురు బలి

గజపతి జిల్లాలో ప్రకృతి విలయానికి నలుగురు బలయ్యారు. ఇద్దరి మృతదేహాలు దొరకలేదు.

- 8లో



కారు బైక్ ఢీ

కారు బైక్‌ఢీకొని నలుగురు గాయపడ్డారు. కలిమెల సమితిలో ఘటన జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

సందడిగా దుర్గమ్మ నిమజ్జనోత్సవం



నిమజ్జనానికి తరలివెళ్తున్న దుర్గాదేవి విగ్రహం

రాయగడ: స్థానిక పోలీస్ కాలనీలో అష్టమి నుంచి విజయదశమి వరకు కొనసాగిన దుర్గా అమ్మవారి పూజలు ముగిశాయి. శుక్రవారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి సదరు సమితి సమీపంలోని హాలువ ప్రాంతంలో ఉన్న నాగావళి నదిలో నిమజ్జనం చేసారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓపీఆర్‌బీ అత్యవసర సమావేశం



సుశాంత్ కుమార్ నాథ్

భువనేశ్వర్: ఒడిశా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ సుశాంత్ కుమార్ నాథ్ అధ్యక్షతన శనివారం అత్యవసర సమావేశం జరిగింది. రాష్ట్ర పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు రాత పరీక్ష మోసాల సంఘటన నేపథ్యంలో ఈ సమావేశం కీలక ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశం వివరాలు స్పష్టం కాకున్నా ఈ సంఘటనపై ఒక కేసు నమోదు చేశారు. రాష్ట్ర క్రైం శాఖ దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తు నివేదిక అందిన తర్వాత బోర్డు తదుపరి చర్యలను ప్రకటిస్తుంది. ఔత్సాహిక అభ్యర్థులు రాత పరీక్ష సన్నాహాల్లో నిమగ్నం కావాలని ఓపీఆర్‌బీ అధ్యక్షుడు సుశాంత్ కుమార్ నాథ్ తెలిపారు.

డీజీపీ అభినందనలు



డీసీపీని అభినందించిన డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా

భువనేశ్వర్: శుక్రవారం కటక్‌లో జరిగిన ప్రసిద్ధ దుర్గా పూజ అనుపు ఊరేగింపులో గాయపడిన కటక్ నగర డీసీపీ ఖిలారి రిషికేశ్‌ను రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా ప్రత్యక్షంగా కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఊరేగింపు శాంతియుతంగా జరిగేలా చూడటంలో డీసీపీ అంకితభావాన్ని డీజీపీ అభినందించారు.

రత్నప్రభకు దర్యాప్తు బాధ్యత

- ఎస్ఐ పోస్టుల కుంభకోణం



రత్నప్రభ

భువనేశ్వర్: సబ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష మోసం సంఘటనపై క్రైమ్ శాఖ డీఎస్పీ రత్నప్రభ శతపతికి దర్యాప్తు బాధ్యత అప్పగించారు. గంజాం జిల్లా గొలంతరా పోలీస్ ఠాణాలో నమోదైన అన్ని కేసులను ఆమె దర్యాప్తు చేస్తారు. క్రైమ్ శాఖ పోలీసు సూపరింటెండెంట్ అనిల్ బెవురియా పర్యవేక్షణ అధికారిగా వ్యవహరిస్తారు. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోసం సంఘటనలో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన 2 దళారులను కోర్టులో ప్రవేశపెట్టారు. క్రైమ్ శాఖ డిజిటల్ సమాచారం సేకరించడంలో నిమగ్నమై ఉంది. పంచ్‌సాఫ్ట్ కంపెనీ యజమాని శంకర్ పృష్టి ఈ మోసం వెనుక ప్రధాన సూత్రధారిగా సందేహిస్తున్నారు. గతంలో, 114 మంది అభ్యర్థులు, ముగ్గురు దళారులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

నాగావళిలో యువకుడి మృతి



సింహాద్రి మినియాక (ఫైల్)

రాయగడ: నాగావళిలో స్నానానికి దిగి ఒక యువకుడు మృతి చెందిన ఘటన సదరు సమితి పరిధి కొత్తపేట గ్రామంలో చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపేటలోని రెల్లివీధికి చెందిన సింహాద్రి మినియాక (14) అనే యువకుడు శుక్రవారం సాయంత్రం స్నానానికని సమీపంలోని నాగావళి నదిలో దిగాడు. అయితే నదీ ప్రవాహం ఎక్కువ కావడంతో కొట్టుకుపోయాడు. హాతీపర్ వద్ద అతని మృతదేహం బయటపడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి

- నువాపడా ఉప ఎన్నికకు వ్యూహరచన
- మంత్రి మండలి విస్తరణ సంప్రదింపులు



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ముఖ్యమంత్రి సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఢిల్లీ చేరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కొత్తగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, భారతీయ జనతా పార్టీ జాతీయ శాఖ అధ్యక్షుడు జేపీ నడ్డాని కలిశారు. మరి కొంతమంది కేంద్ర మంత్రులను కలవనున్నారు. పార్టీ సంస్థాగత అంశాలపై ఆయన చర్చించే అవకాశం ఉంది. ఈ పర్యటన రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. దీర్ఘ కాలంగా మోహన్ చరణ్ మాఝి కొలువు విస్తరణ ఊగిసలాడుతోంది. ఇదిలా ఉండగా అతి త్వరలో నువా పడా ఉప ఎన్నిక జరగనుంది. మోహన్ చరణ్ మాఝి సర్కారుకు, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌కు ఈ ఉప ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం. రాష్ట్రంలో తొలి సారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. విపక్షాలు అంతే ధీటుగా ఈ స్థానం కైవసం చేసుకునేందుకు వ్యూహరచనల్లో తలమునకలై ఉన్నాయి. నువాపడా నియోజక వర్గం ఉప ఎన్నిక దగ్గర పడుతుంది. నాలుగు సార్లు బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేగా పనిచేసిన రాజేంద్ర ఢొలొకియా అకాల మరణం కారణంగా ఈ స్థానం ఖాళీ అయింది. ఇది భర్తీ చేసేందుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికలో విజయంతో ఈ స్థానం కైవసం చేసుకోవడంలో అధికార భారతీయ జనతా పార్టీ, విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెసు ఎవరి తరహాలో వారు పదునైన అభ్యర్థుల ఎంపికలో కసరత్తు చేస్తున్నాయి. అధికార, విపక్షాలు యువతరంతో బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేస్తుండగా కాంగ్రెసు అనుభవజ్ఞుడైన అభ్యర్థితో పూర్వ వైభవానికి కొత్త ఊపిరి పోయాలని యోచిస్తుంది.

ఉప రాష్ట్రపతికి అభినందనలు

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సంక్షేమ పథకాలు తదితర దీర్ఘకాలిక లక్ష్యాలతో కూడిన భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. ఉప రాష్ట్రపతికి 'ఒడిశా విజన్ 2036 – 2047 పుస్తకం అందజేశారు.



భారత ఉప రాష్ట్రపతిని అభినందించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

మంత్రి వర్గ విస్తరణలో జాప్యం

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకుంది. ఇంత వరకు మంత్రి మండలి విస్తరణకు నోచుకోలేదు. అలాగే కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు కీలక నియామకాలు ఊగిసలాడుతున్నాయి. గత ఏడాది జూన్ 12న పదవీ బాధ్యతలు స్వీకరించిన మోహన్ చరణ్ మాఝి తన కొలువులో 14 మంది నాయకులను చేర్చుకున్నారు. దీంతో 6 మంత్రి పదవులు ఖాళీగా కొనసాగుతున్నాయి. ఈ పదవుల్ని ఒక నెలలోపు భర్తీ చేస్తారనే అంచనాలతో ఏడాది పదవీకాలం పూర్తి అయిన మంత్రి వర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ జరగడం లేదు. దీంతో అసంతృప్తి క్రమంగా కట్టలు తెంచుకుంటుంది.

అధిష్టానం సంప్రదింపులతో..

భారతీయ జనతా పార్టీ జాతీయ అధిష్టానం సంప్రదింపులతో ప్రతిపాదిత అభ్యర్థిని నువాపడా ఉప ఎన్నికకు ఖరారు చేయనున్నట్లు సమాచారం . జాతీయ నాయకత్వం పిలుపుతో ముఖ్యమంత్రి ఢిల్లీ పయనమైనట్లు తెలిసింది. పర్యటనలో తొలుత జాతీయ శాఖ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్ హాజరు కావడం రాజకీయ వ్యూహ రచనకు సంకేతంగా పరిగణిస్తున్నారు. వెంబడి బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఢిల్లీ చేరనున్నట్లు బీజేపీ శిబిరాల సమాచారం. ఇదిలా ఉండగా నువాపడా నియోజక వర్గంలో అభ్యర్థిని ఖరారు చేసేందుకు బీజేపీ కేంద్ర పరిశీలన బృందం గత కొద్ది రోజులుగా డేరా వేసి ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు నువాపడా శాసన సభ నియోజక వర్గానికి ఉప ఎన్నిక నిర్వహించే సంకేతాల్ని జాతీయ ఎన్నికల సంఘం జారీ చేసింది. ప్రజలలో ఆదరణ పొందిన, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే అభ్యర్థిని ఖరారు చేసి ఉప ఎన్నిక బరిలోకి దింపుతుందని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు.

మొత్తం మీద ఈ ఉప ఎన్నిక ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, విపక్ష బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ మరియు ఓపీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ నాయకత్వానికి బహిరంగ సవాల్ కానుంది. సానుభూతి పవనాలు సద్వినియోగం చేసుకోవడానికి బీజేడీ దివంగత ఎమ్మెల్యే కుమారుడు జాయ్ ఢొలొకియాను ఉప ఎన్నికలో పోటీకి నిలపనుంది. రాష్ట్రంలో తన ప్రభావాన్ని తిరిగి స్థాపించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ 2024 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన ఘసిరామ్ మాఝికి దాదాపు టికెట్ ఖరారు చేసింది. మరోవైపు బీజేపీ గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన అభినందన్ పండాను మరోమారు అవకాశం కల్పించి గట్టి పోటీనివ్వాలని యోచిస్తుంది. అతడు రాష్ట్ర బీజేపీ నాయకుడు బసంత పండా కుమారుడు. తండ్రి పరపతితో నువాపడాలో బలమైన సంస్థాగత సమర్థత కలిగి ఉన్నాడు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ మార్పులతో పాటు, రాష్ట్ర కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు కీలక నియామకాలు కూడా ఖరారు కావచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

తేనెటీగల దాడి

- ఆరుగురికి తీవ్రగాయాలు



తేనెటీగల దాడిలో గాయపడిన దుము శాంత, అతడి భార్య

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి బలిగాం పంచాయతీ లకమలియగుడ గ్రామానికి చెందిన దుము శాంత దసరా సెలవుల్లో తన భార్య, ముగ్గురు కుమారులను బాగరంగిణిగుడ గ్రామంలోని అత్తవారింట్లో విడిచి వచ్చాడు. పిల్లలకు సెలవులు పూర్తి కావొస్తుండడంతో వారిని తీసుకొచ్చేందుకు శుక్రవారం దుము శాంత బాగరంగిణిగుడ గ్రామానికి వెళ్లాడు. అనంతరం భార్యా, పిల్లలతో శనివారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామానికి బయల్దేరారు. అయితే మార్గమధ్యలో హటగుడ గ్రామ కూడలి వద్ద అకస్మాత్తుగా తేనెటీగల గుంపు వారిపై దాడి చేసింది. అది చూచిన దుము శాంత బైక్ విడిచి భార్యా, పిల్లలతో సమీప మొక్కజొన్న తోటలోనికి పారిపోయారు. వారు భయంతో హాహాకారాలు చేశారు. వారి ఆర్తనాదాలు విన్న సమీపంలో పశువులు మేపుతున్న కొంతమంది వారి వద్దకు వస్తుండగా వారిపైన కూడా తేనెటీగలు దాడి జరిపాయి. తేనెటీగల దాడిలో దుము శాంత కుటుంబ సభ్యులతో పాటు మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ప్రాంతంలో ఉన్నవారు వచ్చి తేనెటీగల దాడిలో గాయపడిన వారిని బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్‌కు చేర్చారు. హాస్పిటల్‌లో వారు చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఘనంగా కంచి కామాక్షి మహోత్సవాలు



పర్లాకిమిడి: శ్రీకంచికామాక్షి దేవి మహోత్సవాలు పర్లాకిమిడి ఉప్పరవీధిలో ఘనంగా జరుగుతున్నాయి. పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం కమి టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రత్యే క పూజలు జరుగుతున్నాయి. గత 12 ఏళ్లుగా పర్లాకిమిడి విశ్వబ్రాహ్మణ సంఘం వారు క్రమం తప్పకుండా కంచికామాక్షి మహోత్సవాలు జరుపుతుండటం విశేషం. శనివారం కోరుకోండ రవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే మంగళవారం కంచి కామాక్షి అమ్మవారి అనుపోత్సవం జరుగనుందని కమిటీ అధ్యక్షులు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి



ఘటనా స్థలంలో ముకుంద జానీ

కొరాపుట్: ఎదురెదురు వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో దంపతులు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి ఉమ్మర్‌కోట్ మార్గంలో తారాగాం వద్ద జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్నాయి. జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ మందిర్ రోడ్డులో మున్సిపల్ స్వీపర్ కాలనీకి చెందిన ముకుంద జానీ (35), అతని భార్య నందేయ్ జానీ (26)లు తమ పిల్లలతో కలిసి పపడాహండిలో దసరా వేడుకలు చూడడానికి వెళ్లారు. ఇదే సమయంలో ఎదురుగా మరో బైక్ శరవేగంగా వచ్చి వీరిని ఢీ కొంది. దీంతో ఘటనా స్థలంలో ఇద్దరు దంపతులు మృతి చెందారు. అయితే ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయట పడ్డారు. పపడాహండి, నబరంగ్‌పూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రేషన్ అందజేత

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రాయగడ బ్లాక్ పెక్కట గ్రామంలో ప్రకృతి విలయతాండవానికి బలైన రైతు కుటుంబాన్ని పర్లాకిమిడి (బీజేడీ) ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి శనివారం పరామర్శించారు. ఐఎండీ ముందుగా గజపతి జిల్లాను రెడ్ అలర్టుగా ప్రకటించినా అధికారులు ఏ కారణం చేత ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయలేదో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విలేకరులతో అన్నారు. ఆయన మృతులు కార్తీక్ శోబోరో, రజిక్ శోబోరో కుటుంబాన్ని పరామర్శించి వారికి నెలకు సరిపడా రేషన్ అందజేశారు. మృతుల కుటుంబానికి పక్కా ఇళ్లు ఇతర సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతానని అన్నారు. ఆయన వెంట బీజేడీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, గుసాని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, రాయగడ బీడీఓ తదితరులు ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



కుంద్ర పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజలు

- ఇసుక వాహనాలను వెళ్లనీయమని గ్రామస్తుల హెచ్చరిక

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి బాగ్దెరి గ్రామ పంచాయతీ డొంగరపల్లి-కొట్రగుడ మధ్య రోడ్డును శ్రమదానంతో గ్రామస్తులు నిర్మించుకున్నారు. ఈ రోడ్డుపై ఇసుకతో వెళ్లే వాహనాలను అనుమతించబోమని జిల్లా దురువ జనజాతి మహిళ మహాసంఘం హెచ్చరించింది. శనివారం దురువ మహిళా మహా సంఘం నేతృత్వంలో ప్రజలు కుంద్ర పోలీస్‌స్టేషన్ అధికారిని కలిశారు. శ్రమదానంతో రోడ్డును ఏర్పాటు చేసుకున్నామని.. దీనిపై ఇసుక వాహనాలను అనుమతించబోమని..దీనికి సహకరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. 2020 అక్టోబర్ నెలలో డొంగరపల్లి నుంచి కొట్రగుడ గ్రామం వరకు 13 వందల మీటర్ల పొడవు రోడ్డును తామంతా శ్రమదానంతో నిర్మించు కున్నామని వెల్లడించారు. ఆ రోడ్డు పైనుంచి కొట్‌పాడ్ సమితిలో ఆరు గ్రామాలకు రోడ్డు ఉండేది కాదని వారు వెల్లడించారు. చతుర్ల గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే కొలాబ్ నది దాటి వెళ్లాల్సి ఉండేదని.. వర్షా కాలంలో 80 కిలో మీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి ఉండేదని వివరించారు. అందుచేత ఆరు గ్రామాల ప్రజల రాకపోకలకు రోడ్డు నిర్మించాలని తాము అనేక సార్లు అధికారులను వేడుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో ఆరు గ్రామాల ప్రజలంతా శ్రమదానంతో రోడ్డును నిర్మించుకున్నామన్నారు. తరువాత ఆ మార్గంలో అంబులెన్స్‌లు, పీడీఎస్ సరుకులు, తదితర ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరేందుకు అవకాశం కలిగిందని వెల్లడించారు. రోడ్డు నిర్మాణం తరువాత కొట్రగుడ వాసులు జగబందు హరిజన్, సొముదు ముదులి, లిక ముదులి, జొగ దురువ మొదలగు వారు కొలాబ్ నదిలో ఇసుకను జేసీబీలతో తవ్వి లక్షలాది రూపాయల విలువైన ఇసుకను వాహనాల్లో తరలించటం వలన తాము శ్రమదానంతో వేసిన రోడ్డు పాడవుతున్నదన్నారు. అందుచేత ఆ మార్గంలో ఇసుక వాహనాల రాకపోకలు జరిపేందుకు తాము అనుమతించమని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. ఆ మార్గంలో ఇసుక వాహనాలను అడ్డుకుంటామని స్పష్టం చేయటంతో గత నెల 24వ తేదీన ఐదుగురు వ్యక్తులు వచ్చి చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకొనేందుకు జరిగిన సమావేశంలో శ్రమదానంతో నిర్మించిన రోడ్డుకైన డబ్బును సంఘ సభ్యులు స్వాహా చేశారని అసత్య ఆరోపణలు చేశారని వారు వెల్లడించారు. ప్రభుత్వ నియమం ప్రకారం టెండర్ పాడకుండా ఇసుకు మళ్లిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, శ్రమదానంతో వేసిన రోడ్డుపై వెళ్లే ఇసుక వాహనాల నుంచి డబ్బు వసూలు చేసినట్టు చేసిన ఆరోపణకు ఆధారాలు చూపాలని వారు వినతి పత్రంలో డిమాండ్ చేశారు. పోలీసు అధికారులను కలిసిన వారిలో రొయిమతి దురువ, సావిత్రి దురువ, జయంతి దురువ, చక్రవతి దురువ, బాసు దురువ, మనోజ్ దురువ, భగత్ దురువ, లక్ష్మీ దురువ, భాబే దురువ, బొనసింగి దురువతో పాటు అనేక గ్రామాల ప్రజలు ఉన్నారు.

కుంద్ర సమితి అధ్యక్షురాలి రాజీనామా



సబ్ కలెక్టర్‌కు రాజీనామా లేఖ అందజేస్తున్న రాజేశ్వరి పొరజ

జయపురం: సబ్ డివిజన్ కుంద్రా పంచాయతీ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ముందే తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖలను ఆమె జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డికి శనివారం అందజేశారు. అలాగే రాజీనామా లేఖ ప్రతిని కుంద్ర బీడీవో పి.మనస్మితకు కూడా అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పంచాయతీ సమితి అధ్యక్షురాలైన తాను గత నాలుగేళ్లలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించానని తెలిపారు. అయితే వ్యక్తిగత కారణాల వలన పదవీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేనని తెలుపుతూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కొంతకాలంగా సమితిలోని కాంగ్రెస్ మద్దతుదారులైన కొంతమంది సర్పంచ్‌లు, సమితి సభ్యులు ఆమెపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదుగురు సర్పంచ్‌లు, ముగ్గురు సమితి సభ్యులతో పాటు 40 మంది కార్యకర్తలు పార్టీని విడిచారు. అనంతరం సమితిలోని 32 మంది సమితి సభ్యులు, సర్పంచ్‌లు సమితి ఆమెపై పలు ఆరోపణలు చేస్తూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు ఓటింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఆమె రాజీనామా చేయడం గమనార్హం.

దుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న మహిళలు

రాయగడ: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక రాణిగుడఫారం సమీపంలోని చిల్లింగ్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మకు రాణిగుడ వాసులు శనివారం సారె సమర్పించారు. ఆ ప్రాంత మహిళలు పిండి వంటలు, చీర, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు తదితరమైనవి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాణిగుడఫారం నుంచి మహిళలంతా సారెను ఊరేగింపుగా అమ్మవారి మండపం వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇదే ఆనవాయితీని ఏటా కొనసాగిస్తామని మహిళలు తెలిపారు.

అనుపు ఉత్సవంలో ఘర్షణ

- ఆరుగురికి గాయాలు
- ఆరుగురు అరెస్టు



అర్థంతరంగా స్తంభించిపోయిన దుర్గా మాత నిమజ్జన ఊరేగింపు



నడి రోడ్డు మీద ఆందోళనకు దిగిన యువజనం



ఆగంతకుల దాడిలో గాయపడిన పోలీసు అధికారి



ఘర్షణలో గాయపడిన సాధారణ వ్యక్తి

భువనేశ్వర్: కటక్ నగరంలో ప్రతిష్టాత్మక దుర్గా పూజల నిమజ్జనం ఊరేగింపులో అకస్మాత్తుగా ఉద్రిక్తత నెలకొంది. దీంతో అమ్మవారి ఊరేగింపు మధ్యలో ఆగింది. ఊరేగింపు సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణతో ఈ పరిస్థితి నెలకొంది. నడి రోడ్డు మీద దేవీ ఊరేగింపు వాహనాలను నిలిపివేశారు. రాత్రి అంతా ఇదే పరిస్థితి కొనసాగింది. దర్గా బజార్ ప్రాంతంలో జరిగిన వర్గ ఘర్షణలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కటక్ డీసీపీ రిషికేశ్ ఖిలారీ ఈ దాడిలో గాయపడ్డారు. రాళ్ల దాడిలో డీసీపీ కన్ను ప్రాంతం గాయపడి తీవ్ర రక్తస్రావమైంది. ఝంజిర్ మంగళ పూజా కమిటీ ఊరేగింపులో వర్గ ఘర్షణ చోటు చేసుకుంది. డీజే ధ్వనుల్ని వ్యతిరేకిస్తూ మొదలైన నిరసన రాళ్ల దాడికి దారి తీసింది. పరిస్థితి ఉద్రిక్తం కావడంతో గాజు సీసాలు రువ్వుకున్నారు. ఆకస్మిక ఉద్రిక్తత నియంత్రణ కోసం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. నిమ్ సాహి వద్ద ఉద్రిక్తతతో దేవీగొడా వైపు వెళ్లే ఊరేగింపులు రోడ్డుపై నిలిచిపోయాయి. శుక్రవారం రాత్రి అంతా కటక్ రోస్ పట్న దుర్గా ఊరేగింపు నిమ్ సాహి వద్ద నిలిచిపోయింది. దర్గఘ బజార్ అణుపు ఉత్సవం ఘర్షణ ఘటనలో ఆరుగురు నిందితులను కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోను పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. అల్లర్లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కటక్ నగరం అదనపు పోలీసు కమిషనర్ నరసింహ భోలా తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి సమితి పాంగాం పంచాయతీ పెద్దగూడ గ్రామం క్రాస్ వద్ద చెరువులో తేలియాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం ఉదయం గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన వారికి మృతదేహం కనిపించడంతో మాత్తిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ దీపాంజాలి ప్రధాన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మల్కన్‌గిరి అగ్నిమాపిక కేంద్రం సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే స్థానికులు ఏవరు కూడా మృతదేహాన్ని గురించలేదు. మృతదేహాన్ని 72 గంటలు తమ సమక్షంలో ఉంచిన తరువాత ఎవరూ రాకపోతే తామే అంత్యక్రియలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని మత్తిలి ఆరోగ్య కేంద్రంలోని మార్చురీలో ఉంచారు.

కారు,బైక్ ఢీకొని నలుగురికి గాయాలు


రోడ్డు పక్కన నుజ్జయిన ద్విచక్ర వాహనం

మల్కన్‌గిరి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఈ సఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి.31 గ్రామం వద్ద రోజు శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తితోపాటు కారులో ఉన్న ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కలిమెల ఆరోగ్య కేంద్రానికి స్థానికులు తరలించారు. అయితే క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదసి చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఐఐసీ ముకుందో మేళ్క తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీకాకుళం పట్టణంలో కంపోస్టు కాలనీకి చెందిన బరాటం ప్రసాదరావు (68) రణస్థలం మండలంలోని కోస్టల్‌లో పాన్‌షాప్ నడుపుతూ అక్కడే నివాసముంటున్న కుమారుడు శ్రీనివాసరావు వద్దకు బయలుదేరాడు. శనివారం ఉదయం రణస్థలంలో దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు స్పందించి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సోషల్ మీడియాలో ఫొటో చూసి కుమారుడు, బంధువులు గుర్తుపట్టి రిమ్స్‌కు చేరుకున్నారు. కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి గ్రామానికి చెందిన ఇప్పిలి ఈశ్వరరావు (48) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల సత్యనారాయణ ప్రవర్తనలో తేడా రావడంతో కుమార్తె, కుమారుడు నిలదీశారు. కోపోద్రుక్తుడైనా ఈశ్వరరావు పంట పొలాలకు కొట్టే పురుగుల మందును శుక్రవారం తాగాడు. తాను చనిపోతున్నానంటూ స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. రూరల్ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు టెక్కలి ఎస్‌ఐ రాము తెలిపారు. బీహార్‌కు చెందిన ఎండీ స్వామన్ 640 గ్రాముల గంజాయి తీసుకుని ట్రైన్‌లో టెక్కలి వచ్చి అక్కడి నుంచి బస్సులో హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హిజ్రాల దారిదోపిడీ

నరసన్నపేట: ఉర్లాం–నడగాం మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం కొందరు హిజ్రాలు కారులో వచ్చి దారిదోపిడీకి పాల్పడ్డారు. నడగాంకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ దొంపాక ఆనంద రమణ మెడలో బంగారు చైన్‌ను లాక్కొని ఉడాయించారు. ఉర్లాం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నడగాం రైల్వేగేటు దాటిన తర్వాత రోడ్డుపై కాచి ఉన్న ఐదుగురు హిజ్రాలు వాహనాన్ని ఆపి డబ్బులు అడిగారని ఆనంద రమణ తెలిపారు. ఇవ్వకపోవడంతో మెడలో తులంన్నర బంగారు చైన్ లాక్కెళ్లిపోయారని, ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

జయపురం చేరిన ఓట్ చోర్ గద్దీ చడో పాదయాత్ర


ఓట్ చోర్ గద్దీ చఢో సంతకాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జయపురం: మహాత్మా గాంధీ జయంతి నాడు అవిభక్త కొరాపుట్ మల్కన్‌గిరి జిల్లా మోటు నుంచి ప్రారంభించిన 'ఓట్ చోర్ గద్దీ చడో' పాదయాత్ర శనివారం మధ్యాహ్నం జయపురం చేరింది. పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ దాస్, విధానసభలో కాంగ్రెస్ నేత, పాటగి ఎమ్మెల్యే రామ చంద్ర కడమ్, పీసీసీ ఉపాధ్యక్షులు సంతోష్ సింగ్ సాలుజ, పీసీసీ మాజీ ఉపాధ్యక్షులు నీరజ శంకర్, మాజీ ఎమ్మెల్యే భుజబల మఝి, రాష్ట్ర సేవాదల్ అధ్యక్షుడు శుభేందు మహంతి, మీడియా సెల్ అధ్యక్షులు అరవింద దాస్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ చంద్ర మహంతి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే నిమయి చరణ సర్కార్ తదితరులు శనివారం మధ్యాహ్నం జయపురం చేరగా వారికి స్థానిక ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణి పతి, కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, లక్ష్మీపూర్ ఎమ్మెల్యేలతో పాటు


సభలో కార్యకర్తలకు వందనం చేస్తున్న పీసీసీ చీఫ్ భక్త చరణ్‌దాస్


ప్రసంగిస్తున్న జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి


మహాత్మా గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పీసీసీ అధ్యక్షుడు తదితరులు

అనేకమంది జిల్లా కాంగ్రెస్ నేతలు, పార్టీ శ్రేణులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. పీసీసీ అధ్యక్షులు భక్త చరణ దాస్‌కు పూల మాలలతో స్వాగతం పలికారు. 'ఓట్ చోర్ గద్ది చడో' నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. నేతలు డీసీసీ భవనానికి చేరుకొని అక్కడ ఉన్న మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో భక్త చరణ దాస్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు చేసి ఓట్లు దొంగిలిచి అధికారం చేపట్టారని దుయ్యబట్టారు.ఉభయ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, నిరుద్యోగ సమస్య, ధరల పెరుగుదల అరికట్టటంలో బీజేపీ పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. బీజేపీ కుతంత్రాలను, ఓట్ల చోరీ సంఘటనలను వివరించేందుకు కాంగ్రెస్ పార్టీ మల్కనగిరి జిల్లా మోటు నుంచి గాంధీ మార్గంలో శాంతియుతంగా పాదయాత్ర చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత నేత రాహుల్ గాంధీ సూచనతో రాష్ట్రంలోని 314 సమితిలలో ఆరు వేల కిలోమీటర్ల పాదయాత్ర జరుపుతున్నామన్నారు. రోజుకు 20 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టనున్నట్టు వెల్లడించారు. పాదయాత్ర సందర్భంగా బీజేపీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజల సంతకాల సేకరణ జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే బాహిణీపతి మాట్లాడుతూ.. ఓట్ చోర్‌లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టాలని అన్నారు. కొరాపుట్ జిల్లాలో లక్ష సంతకాలు చేయించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఓట్ చోర్ గద్దీ చడో సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విలయానికి నలుగురు బలి


రాయగడ బ్లాక్ పెక్కట గ్రామంలో కొండచరియలు విరిగిన ప్రకృతి విలయతాండవం చూస్తున్న ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఈనెల 2న ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు రాయగడ బ్లాక్ మర్లబ పంచాయతీ పెక్కట గ్రామంలో తండ్రీకొడుకులు కార్తీక్ శోబోరో, రాజిక్ శోబోరో బండరాళ్లు, బురదలో కూరుకుపోయి మరణించగా మరో ఇద్దరు గిరిజనులు కనబడకుండా పోవడంతో వారు కూడా మృతిచెంది ఉంటారని అధికారులు భావిస్తున్నారు. మూడు రోజులుగా వారి మృతదేహాలు వెతుకుతున్నా, ఇంతవరకూ ఒడ్రాఫ్ సిబ్బందికి దొరకలేదు. అలాగే ఆర్.ఉదయగిరి బ్లాక్ బస్తిగుడలో త్రినాథ్ నాయక్(45) బండరాళ్ల కింద పడిపోవడంతో కనిపించకుండాపోయాడని అధికారులు నిర్ధారించారు. పది అడుగుల మేరకు బురద, కొండరాళ్లు కప్పివేయడంతో ఒడ్రాఫ్ సిబ్బందికి, పోలీసులకు ఇంతవరకూ దొరకలేదు. ఆర్.ఉదయగిరి బీడీఓ లారీమాన్ ఖర్సల్ శనివారం బస్తిగుడ గ్రామం సందర్శించారు. కొండ చరియలు విరిగి పడి ఉన్న ప్రాంతం అతి భయానకంగా పొగతో కప్పి ఉండటం గమనించారు. కనిపించకుండా పోయిన త్రినాథ్ నాయక్ కుటుంబానికి బీడీఓ రూ. 20 వేల తక్షణ సహాయం అందజేశారు. బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి మృతుల కుటుంబాలని పరామర్శించారు. మోహన బ్లాక్‌లో కనిపించకుండా పోయిన లక్ష్మణ్ మల్లిక్ కుటుంబాన్ని కూడా పరామర్శించి వారి కుటుంబానికి


రాయగడలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

తక్షణ ఆర్థిక సాయం కింద రూ.20 వేలు అందజేశారు. మోహన బ్లాక్‌లో బందగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ మల్లిక్(40) చనిపోవడంతో వారి ఇద్దరు కూతుళ్లకు ప్రభుత్వమే వారి బాగోగులు, ఉన్నత విద్యకోసం తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి మోహన, ఆర్.ఉదయగిరి, రాయఘడ సమితి కేంద్రాల్లో కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాల్ని సందర్శించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాయగడ బ్లాక్‌లో కొండ చరియలు విరిగి పడిన సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరో ఇద్దరు కుటుంబాలను ఆదుకోవాలని కోరుతామన్నారు.

సొంతగూటికి అంతర్యామి గోమాంగో

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ మాజీ చైర్మన్, స్పెషల్ ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ అంతర్యామి గోమాంగో శనివారం బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి సమక్షంలో కమలం కండువా కప్పుకున్నారు. ఆయన తొలుత బీజేపీలో అనేక ఏళ్లు పనిచేసి రాయఘడ బ్లాక్ చైర్మన్‌గా గెలుపొందారు. తర్వాత బీజేడీ చేరి ఆయన భార్య పూర్ణబాసి నాయక్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో మోహనా ఎస్టీ నియోజక వర్గం నుంచి బీజేడీ నుండి పోటీ చేయించారు. అయితే గత 2024 ఎన్నికల్లో పూర్ణబాసి నాయక్ కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గోమాంగో చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత ఆమె రాయఘడ బ్లాక్‌చైర్మన్‌గా గెలుపొందారు. అంతర్యామి గోమాంగో తిరిగి బీజేపీలో చేరడంతో పార్టీలో కొంతమందికి మింగుడు పడటం లేదు. అంతర్యామి గోమాంగో బీజేపీలోకి రాకుండా ఆయనకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించి రాష్ట్ర బీజేపీ అధ్యక్షునికి లేఖలు రాశారు. అయితే ఆయనకు రాష్ట్ర మంత్రి బిభూతీ జన్నా, బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహితో సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఆయన తిరిగి సొంతగూటికి చేరడం సులువైంది.


అంతర్యామి గోమాంగో

దుకాణాల్లో చోరీ

కంచిలి: మకరాంపురం గ్రామ సచివాలయం సమీపంలో మూడు దుకాణాల్లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. మీనాక్షి జిరాక్స్, బుక్ స్టోర్‌లో రూ.3వేలు నగదు, శ్రీ భూలోక మాత ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ షాప్‌లో సుమారు రూ.10వేలు నగదు, టార్చిలైట్లను పట్టుకుపోయారు. కూరగాయలు షాపు తాళాలు పగులగొట్టినా ఎటువంటి చోరీ జరగలేదు. బాధితులు కంచిలి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో హెచ్‌సీ జె.రూప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్


చికిత్స పొందుతున్న లక్ష్మణరావు

హిరమండలం: గొట్టా బ్యారేజీ వద్ద కొరసవాడ గ్రామానికి చెందిన ఏదురి లక్ష్మణరావు ద్విచక్ర వాహనంతో వెళ్తూ అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. శనివారం సుభలయ నుంచి స్వగ్రామం కొరసవాడకు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు స్పందించి బాధితుడిని ఆటోలో హిరమండలం పీహెచ్‌సీ తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

మెడికల్ మాఫియాను అడ్డుకోవాలి

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): జిల్లా కేంద్రం మెడికల్ మాఫియాకు నిలయంగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చాలా ఆస్పత్రుల్లో టెస్టులు, స్కానింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు నోటీసు బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. పలుచోట్ల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, వాటిని సీజ్ చేయని పక్షంలో పోరాటం తప్పదన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు రవి, ఎ.వసంతరావు, ముచ్చ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

అమలపాడులో ఘటాల ఉత్సవం



దుర్గమ్మా..చల్లగా చూడమ్మా..

అమలపాడు గ్రామం భక్త జనసంద్రమైంది. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన దుర్గమ్మతల్లి ఘటాల ఉత్సవానికి అశేష జనవాహిన తరలి రావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. పాహిమాం దేవీ.. పాహిమాం.. అంటూ భక్తుల శరణు ఘోషతో సాగిన ఘటాల ఊరేగింపులో మేళతాళాలు, పగటి వేషాలు, కాళీ మాత వేషధారణలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీ దుర్గాదేవీ లేబర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలోల 108 మంది మహిళలు ఎరుపు వస్త్ర ధారణలో ఊరేగింపుగా దుర్గామాత పూజా మందిరానికి చేరుకున్నారు. అక్కడ నుంచి అసిరిపోలమ్మ తల్లి అమ్మవారి ముర్రాటలు, వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు స్థానిక సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, కారాడ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు దున్న లోకనాధం, దుర్గా దేవి లేబర్ కమిటీ నాయకులు ఇరోతు అప్పన్న, దున్న రాజులు, వి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న కాళీమాత వేషధారణ

– వజ్రపుకొత్తూరు

అమరావతి పేరుతో ఉత్తరాంధ్రకు అన్యాయం

- వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు ధ్వజం
- నేడు పెద్దిపాలెంలో ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో కలిపి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. సొంతంగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, పొరుగు రాష్ట్రాల పథకాలను ఆయన కాపీ పేస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు స్పష్టం చేశారు. విశాఖ జిల్లా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఉత్తరాంధ్ర వనరులను కొల్లగొడుతున్నారని, విశాఖలో సదస్సులు నిర్వహించి, పెట్టుబడులను మాత్రం అమరావతికి తరలిస్తున్నారని ఆరోపించారు. అమరావతిపై ఉన్న ప్రేమతో చంద్రబాబు ఉత్తరాంధ్రపై వివక్ష చూపుతూ.. ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాట పట్టిన ఉత్తరాంధ్ర.. నేటి కూటమి పాలనలో భ్రష్టుపట్టిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వైద్య కళాశాలను సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలిస్తారని వారు వెల్లడించారు. స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడు అనర్హుడని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్. చిత్రంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య

నేడు ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం..

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు భీమిలి నియోజకవర్గం పెద్దిపాలెంలోని చెన్నా కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు అమర్‌నాథ్, కేకే రాజు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. మూలపేట పోర్ట్, భోగాపురం ఎయిర్‌పోర్ట్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అరకు ఎంపీ జి.తనూజారాణి, మాజీ మంత్రులు, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరవుతారని తెలిపారు.

స్కూల్‌గేమ్స్.. మలివిడత పోరుకు రెఢీ


కబడ్డీ సాధనలో క్రీడాకారులు

- నేటి నుంచి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు మొదలు
- ఐదు రోజుల పాటు వివిధ విభాగాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మలివిడత స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు రంగం సిద్ధమైంది. జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వివిద క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, ఉషూ, బాక్సింగ్ నాలుగు క్రీడాంశాల్లో ఎంపికలు ముగియగా.. మిగిలిన క్రీడాంశాలకు ఎంపిక పోటీలను పాఠశాలలకు ముందస్తు దసరా సెలవును ప్రకటించడంతో వాయిదాపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిలో కొన్ని మినహా మెజారిటీ సెలక్షన్స్ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోనే జరగనున్నాయి. ఐదు రోజులపాటు నిర్దేశిత షెడ్యూల్‌ను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ ఎ.రవిబాబు, కార్యదర్శి బీవీ రమణ సంయుక్తంగా వెల్లడించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పీడీ–పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.తవిటయ్య, మొజ్జాడ వెంకటరమణ పిలుపునిచ్చారు.

ఐదు రోజుల షెడ్యూల్ ఇది..


వాలీబాల్ సాధనలో..

తొలిరోజు 5న: హాకీ (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్), వెయిట్‌లిఫ్టింగ్ (పెద్దపాడు), రెజ్లింగ్ (పెద్దపాడు), ఆర్చరీ (రాజ్‌కుమార్ అకాడమీ శ్రీకాకుళం), రగ్బీ, నెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, షూటింగ్‌బాల్ (టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం), టేబుల్‌టెన్నిస్ (శాంతినగర్‌కాలనీలో డీఎస్ఏ ఇండోర్ స్టేడియం), యోగా (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్యవరం, నరసన్నపేట మండలం), లాన్‌టెన్నిస్ (శ్రీకాకుళం ఆర్ట్స్‌కాలేజ్ టెన్నీస్ అకాడమీ). కరాటే (శ్రీకాకుళం మహాలక్ష్మినగర్‌కాలనీలోని శ్రీచైతన్య స్కూల్).

6న: అథ్లెటిక్స్ (కోడిరామ్మూర్తి స్టేడియం శ్రీకాకుళం), త్రోబాల్ (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్), అండర్–14, 17 చెస్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎచ్చెర్ల).

7న: కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్ బాలురుకు మాత్రమే (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానం), క్రికెట్ (ఆర్ట్స్‌కాలేజ్), బాల్‌బాడ్మింటన్ (ఆర్ట్స్‌కాలేజ్), అండర్–19 చెస్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎచ్చెర్ల).

8న: కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాలికలకు మాత్రమే (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానం), స్విమ్మింగ్ (శాంతినగర్‌కాలనీలో డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్), తైక్వాండో, ఫెన్సింగ్ (శ్రీకాకుళం టౌన్ హాల్), బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర (ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం శ్రీకాకుళం), బేస్‌బాల్ (కేఆర్ స్టేడియం శ్రీకాకుళం)

9న: హ్యాండ్‌బాల్ (జెడ్పీహెచ్ స్కూల్ తొగరాం, ఆమదాలవలస మండలం).


షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి..



జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు సంబంధించి మలివిడత షెడ్యూల్‌ను ప్రకటించాం. అండర్–14,17,19 విభాగాల్లో బాలబాలికలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన మైదానంలో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలి. అవసరమైన ధ్రువపత్రాలు తీసుకురావాలి.

– బడి వెంకటరమణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ

సద్వినియోగం చేసుకోవాలి..



స్కూల్‌గేమ్స్ అనేవి విద్యార్థులకు వరమనే చెప్పాలి. క్రీడాకారులు గుర్తింపు పొందేది, తయార్యేది స్కూల్‌గేమ్స్ నుంచే. ఎంపికల్లో ప్రతిభ కనబర్చి జిల్లా జట్లకు ఎంపికయితే రాష్ట్రపోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. బాలబాలికలంతా సద్వినియోగం చేసుకోవాలి.

– మొజ్జాడ వెంకటరమణ, జిల్లా పీడీ–పీఈటీ సంఘ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

బియ్యం లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

భామిని: మండలంలోని పసుకుడి వద్ద ఏబీ రోడ్డులో ప్రయాణిస్తున్న బియ్యం లారీ శనివారం బోల్తా పడింది. రాయపూర్ నుంచి విశాఖ పట్నం వస్తున్న లారీ పసుకుడి మలుపు తిరిగే సమయంలో అదుపుతప్పి లోడ్ లారీ తిరగబడింది. అయితే ఈ ప్రమాదంలో ఎటు వంటి ప్రాణనష్టం జరగలేదు.

దివ్యాంగుల ఈత పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పారా ఈత పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి ఈత పోటీల్లో జిల్లాకు చెందిన పారా స్విమ్మర్స్ ప్రతిభ చాటారని అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. విశాఖపట్నం లోని జీవీఎంసీ ఆక్వా ఈత కొలనులో అట్టహాసంగా నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన పారా స్విమ్మర్స్ మౌనిక సబ్ జూనియర్ విభాగంలో 50 మీటర్ ఫ్రీ స్టైల్ పోటీల్లో..ప్రియాంకదాస్ జూనియర్ విభాగం లో 50 మీటర్ ఫ్రీ స్టైల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారని, వారిద్దరికీ అభినందనలు తెలియజే స్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని హైదరాబాద్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారన్నారు. ఈనెల 12 న ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

ఎస్సీ, ఎస్టీ కేసులకు రూ.48లక్షల నష్టపరిహారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో 46 ఎస్సీ, ఎస్టీ కేసులకు రూ.48 లక్షల నష్టపరిహారం చెల్లించామని కలెక్టర్ డా.ఎన్. ప్రభాకరరెడ్డి అన్నారు. మరో 15కేసులకు రూ.14.50లక్షలు చెల్లించాల్సి ఉందని ఒక కేసు విచారణ కొనసాగుతోందన్నారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ సుమోటోగా కులధ్రువీకరణ పత్రాలను వాట్సాప్, మీ సేవ ద్వారా పొందే సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటివరకు ఒక లక్షా 10వేల కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ భూ వివాదాల కారణంగానే ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదవుతున్నాయని భూ సమస్యలను త్వరగా పరిష్కరించడం చాలా అవసరమన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.హేమలత, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, ఏఎస్పీ అంకితా సురానాలతో పాటు మరికొంతమంది అధికారులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి ధర్మకర్తలి మండలి ప్రమాణస్వీకారం



ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పైడితల్లి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలువేల్పు పైడితల్లి అమ్మవారి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం కోటలోని రౌండ్ మహల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, సభ్యులు కె.కామేశ్వర రావు, జి.ఆనందరావు, ఎల్.కుమారి, వి.వెంకట లక్ష్మి, డి.కృష్ణమూర్తిరాజు, పి.రామయ్య పంతులు, ఎల్.స్వాతికుమారి, కె.తులసి, డి.పద్మావతి, కె.గోపాలరెడ్డిలతో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ఉప ముఖ్య అర్చకుడు వైవీ.రమణ ప్రమాణస్వీకారం చేశారు. పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈఓ. కె.శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ, ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమం

సాలూరు: పట్టణంలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం నియోజకవర్గ స్థాయి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొని మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయ రైతు కుయ్యో..మొర్రో..!

- వరున తుఫాన్ల ప్రభావంతో కుదేలు
- ఊటబారి మొక్కలు చనిపోతూ, రాలిపోతున్న పూత, పిందె
- పెట్టుబడి దక్కదంటున్న రైతులు
- నియోజకవర్గంలో 500కు పైబడి ఎకరాల్లో సాగవుతున్న కూరగాయ పంటలు
- పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు



ఊటపట్టి చనిపోతున్న టమాటో



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రామభద్రపురం గ్రామానికి చెందిన కర్రి సాంబ. సుమారు ఎకరా విస్తీర్ణంలో వివిధ కూరగాయ పంటలు సాగు చేస్తూ దాదాపు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు.అయితే తుఫాన్ వల్ల ఎంతో కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో చూస్తుండగానే కుళ్లిపోతోంది. పెట్టుబడి పోవడమే కాకుండా లాభం రావాల్సిన మరో రూ.50వేలు పోయే పరిస్థితి నెలకొంది. పంటల సాగుకు అధికంగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కుటుంబమంతా ఆరుగాలం కష్టపడినా ప్రకృతి సహకరించడంలేదని చనిపోతున్న మిరప మొక్కలను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రామభద్రపురం: ఈ నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస తుఫాన్ల కారణంగా కురుస్తున్న వర్షాలతో కూరగాయ రైతు కుదేలయ్యాడు. రోజూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూరగాయల పంటలు పూర్తిగా పాడై రైతులు నష్టాలపాలవుతున్నారు. కుటుంబమంతా ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు తమ కళ్ల ఎదుటే పాడవడం చూసి రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రకృతి సహకరించక తుఫాన్‌ల వల్ల రోజులు తరబడి కురుస్తున్న వర్షాల కారణంగా పంట భూముల్లో నీరు చేరి ఊటపట్టి కూరగాయ పంటలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి,తెర్లాం మండలాల్లోని రైతులు అధికంగా కూరగాయలు పండిస్తున్నారు. 500 పైబడి ఎకరాలలో వంగ, టమాటో, బెండ, చిక్కుడు, కాలిఫ్లవర్, క్యాబేజీ, పొట్టి, పొడవు చిక్కుడు, దొండ, పర్చిమిర్చి, బంతి, ఉల్లి తదితర పంటలతో పాటు ఆకూరలు సాగవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.అయితే పంటలు ఏపుగా పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందన్న సమయంలో వరుస తుఫాన్ల ప్రభావం పడింది. దీంతో పంటల్లో నీరు చేరి భూమి ఊటపట్టడంతో వేరు కుళ్లు తెగులు సోకి మిరప, వంగ, టమాటో మొక్కలు చనిపోతున్నాయి. అలాగే దుంప జాతులతో పాటు ఆకుకూరల పంటలు పాడవుతున్నాయి. కాలిఫ్లవర్‌లో నీరు చేరి ఆరుతున్న కొద్దీ కుళ్లిపోతోంది. ఉల్లిపంట భూమి ఇవకపట్టి కుళ్లిపోతోంది. ఆకు కూరలకు మచ్చ తెగులు సోకి నాణ్యత, దిగుబడి తగ్గిపోతున్నాయి. చిక్కుడు, దొండ, కాకర. తదితర తీగ జాతి పంటలకు వివిధ రకాల తెగుళ్ల సోకి పూత, పిందె రాలిపోతున్నాయి. వివిధ రకాల చీడపీడలు ఆశించి పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిలలాడుతున్నారు. ప్రకృతి విపత్తులకు తోడుగా తెగుళ్ల సోకడంతో పెట్టుబడులు సైతం కోల్పోయే పరిస్థితి నెలకొంది. తాము అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఎంతో ఆశతో కష్టపడి పండించిన పంట తుఫాన్ల కారణంగా నష్టాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



పాడైపోతున్న బంతి పంటను చూపుతున్న మామిడి పాపమ్మ



తుఫాన్ ప్రభావంతో పూర్తిగా పాడవుతున్న మిరపపంట



రాలిపోతున్న విరిగిపుతున్న మిరప కాయలతో కొమ్మలు చూపిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతు మామిడి కాంతారావు

తీవ్రంగా నష్టపోయాం..



చిన్నప్పటి నుంచి కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను. వాతావరణ పరిస్థితుల కారణంగా అధికంగా కూరగాయల పంటలు నష్టపోవడం ఇదే మొదటిసారి చూస్తున్నాను. నోటికాడికి వచ్చిన అన్నం ముద్దను తీసేసిన చందంగా ఉంది. అప్పు చేసి రూ.25 వేలు పెట్టుబడి పెట్టి అర ఎకరా విస్తీర్ణంలో ఉల్లి నాటాను. అలాగే కాలిఫ్లవర్ పంట వేశాను. తుఫాన్ కారణంగా ఉల్లి మొక్క బయటకు రాకముందే కుళ్లిపోతోంది. కాలిఫ్లవర్ పంట చేతికందుతుందన్న సమయంలో పంట పాడవడంతో అప్పులు పాలవుతున్నాను.

కర్రి చిన్నమ్మతల్లి. రైతు, రామభద్రపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



తుఫాన్ కారణంగా కూరగాయ పంటలు మా కళ్ల ఎదుటే నాశనమయ్యాయి.ఆ ప్రభావం దిగుబడులపై పడి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కూరగాయ పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి.

మూదడ్ల పైడితల్లి
కూరగాయల రైతు, రామభద్రపురం

పరిశీలిస్తాను..



సాధారణంగా నీరు అధికంగా ఉన్న భూముల్లో వేరు కుళ్లు తెగులు సోకుతుంది. కూరగాయల పంటల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు తీసేయాలి. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పంట నష్టాలను అంచనా వేసి, నివేదికలు పంపిస్తాం. ఉద్యానశాఖాధికారులు చెప్పిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

పి.మోహనకృష్ణ ఉద్యానశాఖ అధికారి

అంగన్‌వాడీల ఆకలికేకలు..!

- రెండు నెలలుగా అందని జీతాలు



విజయనగరం పట్టణంలోని తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో విద్యను బోధిస్తున్న కార్యకర్త

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. ఒకటో తేదీ మాట దేవుడెరుగు ఏ నెలకు ఆనెల కూడా జీతాలు పడని పరిస్థితి నెలకొంది. అధికారంలోకి రాకముందు మాటలకు, అధికారం చేపట్టిన తర్వాత మాటలకు పొంతన ఉండడం లేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు గడిచిన రెండు నెలలుగా జీతాలు పడని పరిస్థితి. వచ్చే జీతం తక్కువ. అది కూడా సకాలంలో పడక పోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు అందకపోవడం వల్ల పిల్లల ఫీజులు, కుటుంబ పోషణ కష్టతరంగా మారుతుందని వాపోతున్నారు.

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. భోగాపురం, విజయనగరం, రాజాం, చీపురుపల్లి, బొబ్బిలి, వియ్యంపేట, ఎస్.కోట, బాడంగి, గంట్యాడ, గజపతినగరం, గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 2206 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలతో పాటు ఆయాలు పనిచేస్తారు.

రెండు నెలలుగా అందని వేతనాలు:

అంగన్‌వాడీలకు రెండు నెలలుగా జీతాలు అందలేదు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి జీతాలు అందలేదు. అంగన్వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500,మినీ అంగన్ కార్యకర్తకు రూ.7000, ఆయాకు రూ.7000 చొప్పున జీతాలు చెల్లించాలి. అయితే రెండు నెలలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.23000, మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు రూ. 14 వేలు, ఆయాకు రూ 14 వేలు చెల్లించాల్సి ఉంది.

బిల్లు పెట్టాం

అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు రెండు నెలలకు సంబంధించి జీతాలకు సంబంధించి బిల్లు పెట్టాం. ఆర్‌బీఐలో పెండింగ్ ఉండవచ్చు.

టి.విమలారాణి, పీడీ, ఐసీడీఎస్

అమ్మవారి పండగ ప్రశాంతంగా జరగాలి

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరపాలని, ప్రతి సాధారణ భక్తుడికి చక్కటి దర్శనం లభించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అధికారులు అందుకు తగ్గట్టుగా సన్నద్ధం కావాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. తొలుత ఏర్పాట్లపై మంత్రికి కలెక్టర్ వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పోలీస్ శాఖ, రెవెన్యూ , దేవస్థానం వారు కలిసి కంట్రోల్ రూమ్ నుంచి అనునిత్యం పర్యవేక్షించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీటి సరఫరా ప్లాస్టిక్ రహితంగా సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. టాయిలెట్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున 170 బస్సుల వరకు అవసరం అవుతాయని, ఆయా రూట్లలో బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అలంకరణలు, నగరమంతా సుందరీకరణ వారం రోజుల పాటు ఉంచాలని, పండగ వాతావరణం వెల్లివిరిసేలా ఉండాలన్నారు.

స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి గజపతి రాజు మాట్లాడుతూ వీవీపీ దర్శనాలకు ఇబ్బంది కలగకుండా ప్రోటోకాల్ అధికారులు జాగ్రత్తగా చూడాలన్నారు. రథాలన్నీ తనిఖీలు చేసుకుని, వలంటీర్లకు, సేవా ప్రతినిధులకు ఐడీ కార్డులను జారీ చేయాలన్నారు.

7న పట్టువస్త్రాల సమర్పణ

కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి మాట్లాడుతూ దేవదాయ శాఖమంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి అమ్మవారికి 7 వ తేదీన ఉదయం పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లను దేవాదాయ శాఖ వారు చేయాలని ఆదేశించారు. సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా , గర్భగుడిలో పూజలు ఎక్కువ సమయం నిర్వహించ రాదని, అర నిమిషం కన్నా భక్తులను లోపల ఉంచరాదని స్పష్టం చేశారు. విజయనగరం ఉత్సవాల ఏర్పాట్ల పై సంయుక్త కలెక్టర్ సేతుమాధవన్ వివరించారు. సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, అదనపు ఎస్పీ సౌమ్యలత, కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ యశస్వి, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 5,6 వ తేదీల్లో రెండు రోజుల పాటు విజయనగరం జిల్లాలో ఘనంగా జరగనున్న విజయనగరం ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి హోం మంత్రి వంగలపూడి అనితను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా టూరిజం ఆఫీసర్ కుమారస్వామి విశాఖపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో మంత్రి అనితకు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మంత్రి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. విజయనగరం జిల్లా చారిత్రక ప్రాముఖ్యతను దేశమంతటా తెలియజేయాలన్న ఉద్దేశంతో, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మంత్రి అనిత అధికారులకు సూచించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిరిమానోత్సవానికి కనీవినీ ఎరుగని భద్రత

- ఎస్పీ దామోదర్
- ముగ్గురు ఏఎస్పీలు,15మంది డీఎస్పీలు, 40 సీఐల నియామకం



వన్ టౌన్ స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీగోవింద రావు, సీసీఎస్ సీఐ కాంతారావు

విజయనగరం క్రైమ్: పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి కనీవినీ ఎరగని రీతిలో డేగ కళ్లతో పటిష్టమైన బందోబస్తు పోలీస్ శాఖ నిర్వహిస్తుందని ఎస్పీ దామోదర్ శనివారం అన్నారు. ఈ మేరకు విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ దామోదర్ తో పాటు ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ గోవిందరావు, సీసీఎస్ సీఐ కాంతారావులు పాల్గొన్నారు. అమ్మవారి జాతర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం సిరిమాను ఉత్సవమని, ఈ ఉత్సవానికి ముగ్గురు ఏఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 40 సీఐలు150 మంది ఎస్సైలతో కలిసి మొత్తం 2,600 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ శాఖ తరపున 70, దేవాదాయ శాఖ తరపున 54 సీసీ కెమెరాలతో పాటు 10 డ్రోన్ కెమెరాలను ఈ సారి సిరిమాను బందోబస్తులో వినియోగిస్తున్నామన్నారు. అన్ని కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి సర్వత్రా భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. అమ్మవారి టెంపుల్ ఎదురుగా ఉన్న భవంతిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కెమెరాలన్నీ ఈ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమయ్యేలా పోలీస్ శాఖ నుంచి కమ్యూనికేషన్ వింగ్ బాధ్యత వహిస్తుందని చెప్పారు. ఉత్సవం కనుల పండువగా, అంగరంగ వైభవంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ దామోదర్ విజ్ఞప్తి చేశారు.

విధుల్లో ఉండగా ఆర్టీసీ కండక్టర్ మృతి



ఆకుల దాసు మృతదేహం

రామభద్రపురం: విధుల్లో ఉన్న ఓ కండక్టర్ రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ దాటాక గుండెపోటుతో సీటులోనే కుప్పకూలి శనివారం మృతి చెందారు. ఈ ఘటనపై ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు సాలూరు పట్టణంలోని రామాకోలనీకి చెందిన ఆకుల దాసు (57) కండక్టర్‌గా పనిచేస్తున్నారు. సాలూరు బస్ డిపో నుంచి ప్రయాణికులతో విశాఖపట్నం వెళ్తున్న బస్సులో ఆయన శనివారం విధుల్లో ఉన్నారు. ఆ బస్సు రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొంత మంది ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరి వెళ్తుండగా గాంధీ బొమ్మ సమీపంలో టికెట్ల కలెక్షన్ కోసం బస్సు ఆపారు. టికెట్ కలెక్షన్ చేద్దామని కండక్టర్ దాసు సీటులోంచి లేస్తుండగా గుండెపోటు రావడంతో సీటులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే డ్రైవర్, ప్రయాణికులు కలిసి స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ అస్పత్రికి కండక్టర్‌ను తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు ఆస్పత్రికి చేరుకుని విచారం వ్యక్తంచేశారు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమారులు గౌరీప్రసాద్, శివాజీ, కుమార్తె తులసి ఉన్నారు. విధులకు వెళ్తానని చెప్పి కానరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యుల రోదన చూపరులు, ప్రయాణికులను కలిచివేసింది.

కొండను పేలుస్తూ ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదస్థలంలో బండరాళ్ల మధ్య కేశవ్ మృతదేహం

పాచిపెంట: విశాఖపట్నం-రాయపూర్ హరిత రహదారి పనుల్లో భాగంగా మండలంలోని బంగారు గుడ్డి సమీపంలో కొండను పేల్చి బండరాళ్లను తొలగిస్తున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం కొండను పేల్చే సమయంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరూ బీహార్ రాష్ట్రం నుంచి కూలి పనుల నిమిత్తం వచ్చిన వ్యక్తులుగా గుర్తించారు, తీవ్ర గాయాలతో ఉన్న సూరజ్‌ను విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు, ప్రాణాలు కోల్పోయిన కేశవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ శనివారం తెలిపారు.


వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

విజయనగరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన నూతన నియామకాల్లో పలువురు జిల్లా నాయకులకు పదవులు దక్కాయి. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన గొరపల్లి జయప్రకాష్ నియమితులయ్యారు. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ చెందిన జీవీ రంగారావు, రాష్ట్ర ఐటి వింగ్ ప్రధాన కార్యదర్శిగా మారం బాల బ్రహ్మరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌టీయూసీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా నెల్లిమర్ల నియోజవర్గానికి చెందిన ధవళ. లక్ష్మణరావులు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

గాంధీ విగ్రహం ధ్వంసం కేసులో 8 మంది గుర్తింపు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి జెడ్పీ హెచ్ పాఠశాల ఆవరణ వద్ద గురువారం గాంధీజీ విగ్రహం ధ్వంసం చేసిన కేసులో దుండగులను గుర్తించినట్లు ఎస్సై నర్సింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనలో మామిడిపల్లి గ్రామానికి చెందిన 8 మంది దుండగులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో ఇద్దరు మైనర్‌లు ఉన్నారని, ఆరుగురిపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని తెలిపారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



ఎంఈఓ-1సామల సింహాచలంకు ఆర్డర్లు అందిస్తున్న పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు

బలిజిపేట: విద్యార్థులు తెలుగు భాషపై మంచి పట్టు సాధించే విదంగా వారికి గుణాత్మక విద్యను అందించాలని ఎంఈఓ -1సామల సింహాచలం తెలిపారు. భాషా పండితులుగా పనిచేస్తూ తెలుగు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తెచ్చిన ఆర్డర్ కాపీలను ఎంఈఓ-1సామల సింహాచలం తీసుకున్నారు. నూరిరాము(గంగాడ), బి.లలిత(గలావల్లి), శకుంతల(నారన్నాయుడువలస)లు ఎంఈఓ-1ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారి దగ్గర పత్రాలను తీసుకుని విద్యార్థులకు మంచి భాషా ప్రావీణ్యంతో కూడిన విద్యను అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

డ్వాక్రా బజారులో 19 రాష్ట్రాల సంఘాలు



డ్వాక్రా బజార్, సరస్‌లో మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి

విజయనగరం టౌన్: అఖిల భారత డ్వాక్రా బజార్‌లో ఏపీతో పాటు 19 రాష్ట్రాలకు చెందిన మహిళా సంఘాలు పాల్గొనడం అభినందనీయమని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సరస్‌ను ఆయన సందర్శించి, మహిళా సంఘాలతో స్టాల్స్‌లో సేల్, ఏర్పాట్లు తదితర వాటిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదురోజుల నుంచి నిర్వహిస్తున్న డ్వాక్రా బజారు, సరస్‌కు గతేడాది కంటే ఈ ఏడాది విశేషమైన స్పందన లభించిందన్నారు. గతేడాది రూ.8 కోట్ల అమ్మకాలు జరిగాయని, ఈ ఏడాది రూ. 12 కోట్ల వరకూ జరిగే అవకాశం ఉందన్నారు. పైడితల్లి అమ్మవారి పండగ వేళ వస్త్రాలు, గృహోపకరణాలకు షాపులు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఆకట్టుకునే కలంకారీ కాటన్ వస్త్రాలు, కొయ్యబొమ్మలు, జూట్, వెదురు ఉత్పత్తులు ఒకేచోట లభ్యమవుతున్నాయన్నారు. విజయనగర ఉత్సవాల్లో భాగంగా ఉద్యానవనశాఖ సమన్వయంతో ఫ్లవర్‌షోను ఇక్కడే ప్రత్యేక ఆకర్షణతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాలలోని పలు జాతుల పుష్పాలను తీసుకువస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, డీపీఎంలు రాజ్‌కుమార్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి జాతర భద్రత ఏర్పాట్ల పరిశీలన



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.రామ్ సుదర్ రెడ్డి, ఎస్పీ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత, ఆర్డీఓ కీర్తి

విజయనగరం క్రైమ్: ఈ నెల 5, 6, 7 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ల, సిరిమానోత్సవం జరగనున్న నేపథ్యంలో భద్రత, బందోబస్తు ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.రామ్ సుందర రెడ్డితో కలిసి ఎస్పీ దామోదర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయం వద్ద, భక్తుల దర్శనాలకు ఏర్పాటు చేసిన క్యూలను పరిశీలించారు. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేయనున్న రెవెన్యూ, పోలీసు శాఖల తాత్కాలిక కంట్రోల్ రూమ్‌లను, అలాగే ఆలయం పరిసర ప్రాంతాలను, దర్శనాలకు భక్తులు వచ్చి, దర్శనం అనంతరం ఆలయం బయటకు వెళ్ళే మార్గాలను తనిఖీ చేశారు. సిరిమాను తిరిగే మార్గం మూడు లాంతర్ల జంక్షన్, కోట, గురజాడ అప్పారావు రోడ్డు జంక్షన్, మసీదు జంక్షన్, జియర్ కాంప్లెక్స్, కోట లోపల వరకు కాలి నడకన వెళ్లి క్షేత్రస్థాయిలో బారికేడ్లను ఏర్పాటు, కటాఫ్ పాయింట్స్ వద్ద భద్రత, బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసి, చేయాల్సిన పనుల గురించి దిశానిర్దేశం చేశారు. విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి తొలేళ్ల, సిరిమానోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అమ్మవారి దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించాలని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎస్.రామ్‌సుందర రెడ్డి, ఎస్పీ ఎఆర్ దామోదర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆర్డీఓ దాట్ల కీర్తి, డీఎస్పీ ఆర్.గోవిందరావు, దేవదాయశాఖ ఏసీ శిరీష, మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు, పలువురు సీఐలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీపీపీ లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దుచేయాలి

మక్కువ: ప్రభుత్వ వైద్యకళాశాలల పీపీపీ లీజు నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణమే రద్దుచేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్యకళాశాలలు నడపాలని రైతుకూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పీడిక అసిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నంద గ్రామంలో శనివారం ఆర్‌సీఎస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అసిరి మాట్లాడుతూ 10ప్రభుత్వ వైద్యకళాశాలల పీపీపీ లీజు నిర్ణయం రద్దుచేసి, ప్రతిపాదనలో ఉన్న పార్వతీపురం మెడికల్ కళాశాలను తక్షణమే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. శతశాతం ఎంబీబీఎస్ సీట్లను ప్రభుత్వ కోటాలోనే భర్తీచేయాలన్నారు. అలాగే షెడ్యూల్డ్ గ్రామమైన బీరమాసి గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో, గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వైద్యం, విద్య, ఇతరత్రా ఏ అవసరమొచ్చినా గిరిశిఖర గ్రామం బీరమాసి నుంచి, దిగువనున్న గ్రామాలకు చేరుకోవాల్సి ఉందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే బీరమాసి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌సీఎస్ నాయకులు ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.